క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు భిక్ష



భిక్షను స్వీకరిస్తున్న మాలధారణ స్వాములు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మాలధారణ స్వాములకు భిక్ష కార్యక్రమం 13వ రోజు నిర్వహించారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భిక్ష కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, కోశాధికారి కూన పార్వతి గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, నెక్కలపూడి సూర్య చంద్రరావు, ఆలయ మేనేజర్ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ గుడి పరిసరాల్లో ప్లాస్టిక్ నిషేధం



గుబ్బల మంగమ్మతల్లి గుడి పరిసరాలను శుభ్రం చేస్తున్న కూలీలు

బుట్టాయగూడెం: గిరిజనుల ఆరాధ్య దైవంగా పూజించబడుతున్న గుబ్బల మంగమ్మతల్లి గుడి పరిసర ప్రాంతాలపై ఆలయ కమిటీ వారు ప్రత్యేక దృష్టి పెట్టారు. దీనిలో భాగంగా 10 మంది కూలీలతో ప్రతి రోజూ ఆలయ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లోని ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాస్‌లు, కవర్లను శుభ్రం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత అక్కడే సహపంక్తి భోజనాలు చేస్తుంటారు. అనంతరం వారు తిన్న ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, రకరకాల ప్లాస్టిక్ కవర్లు అక్కడే వదిలేస్తుంటారు. దీని వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున కమిటీ ప్రత్యేక కృషితో కూలీలను ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. అలాగే అటవీశాఖ అధికారులు కూడా ప్లాస్టిక్ నిషేదంపై ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



షేక్ మున్ని

కుక్కునూరు: ప్రభుత్వం విలీన మండలాలకు స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి షేక్ మున్ని పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఫ్రీ బస్సు పథకం విలీన మండలాల మహిళలకు అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రారంభించిన వెంటనే ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసులను ఆపి వాటి స్థానంలో అల్ట్రా డీలక్స్ సర్వీసులను ఏర్పాటు చేశారని వాటితో మహిళలకు ఫ్రీ పథకం అమలు కాకపోగా పురుషులు అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని మండిపడ్డారు.

నిరాహార దీక్షకు మద్దతు



నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన నాయకులు

బుట్టాయగూడెం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుల ధృవీకరణ పత్రం కోసం కుంజా ప్రణీత్, కుటుంబ సభ్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 8వ రోజుకు చేరుకుంది. మంగళవారం నిర్వహించిన దీక్షకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి బన్నే వినోద్, పీవైఎల్ నాయకులు తగరం బాబూరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయం కోసం ప్రణీత్, కుటుంబ సభ్యులు 8 రోజులుగా దీక్ష చేస్తుంటే రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రమీలారాణి, సోమరాజులకు పుట్టిన సంతానం ప్రణీత్ అని కోర్టు ఆర్డర్ క్లియర్‌గా ఇచ్చినప్పటికీ కుల ధృవీకరణ పత్రం ఇవ్వడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

జీఎస్టీతో అన్ని వర్గాలకు మేలు

టి.నరసాపురం: జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అధికారిణి జి.మణికుమారి తెలిపారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ మణికుమారి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పెరిగిన నీటి ప్రవాహం

దెందులూరు: దెందులూరు శివారు సత్యనారాయణపురంలో గుండేరు వాగు నీటి ప్రవాహం ఉధృతి పెరిగింది. గుండేరువాగు సత్యనారాయణపురం గ్రామం మధ్యలో నుంచి డ్రెయిన్లలోకి వెళ్లడంతో ప్రతిఏటా ఈ పరిస్థితి నెలకొంటుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల ప్రభావంతో గుండేరువాగులో మంగళవారం ప్రమాదకర స్థితిలో నీటి ప్రవాహం పెరిగింది.

గిరిపుత్రుల ఒళ్లు హూనం..



గుంతల మయంగా మారిన రహదారి



గుంతల్లో వర్షం నీటితో నిండిన రహదారి

- అధ్వానంగా ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రహదారి
- అవస్థలు పడుతున్న గిరిజనులు

పోలవరం రూరల్: ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా మారడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కార్మెల్‌పురం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం కురిస్తే నీరు నిలిచిపోతోంది. రోడ్డుపై రాళ్లు పైకి లేచి వాహనాలు జారిపడిపోతున్నాయని, వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో గుంతల్లో వాహనాలు జారిపడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయని చెబుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు రాత్రి సమయాల్లో తిరగాలంటేనే భయంగా ఉందని, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, వాహనదారులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి, రోడ్డు గుంతలతో నిండిపోయినా కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా జంగిల్ పెరిగిపోయి ఎదురొచ్చే వాహనాలు కూడా కానరాని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, నాయకులు కూడా ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని గిరిజనులు ఆరోపిస్తున్నారు. కార్మెల్‌పురం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకు 11 కిలోమీటర్ల పొడవునా ఇటికిలకోట, బోడిగూడెం, వింజరం, గుంజవరం, సింగన్నపల్లి, మామిడిగొంది, చేగొండిపల్లి గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా నిత్యం ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా తిరగడం ఇబ్బందిగా మారింది. 2022లో అప్పటి ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే రోడ్డు నిర్మాణం జాప్యం జరగడంతో పూర్తి కాలేదు. ఇప్పటికైనా ఈ రోడ్డు పరిస్థితిని పరిశీలించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ప్రయాణ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

కనీస మరమ్మతులు లేవు



కార్మెల్‌పురం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు మార్గం గుంతలు పడి అధ్వానంగా మారింది. కనీస మరమ్మతులు కూడా నోచుకోలేదు. వర్షం కురిస్తే ప్రధాన రోడ్డు మార్గం మొత్తం గుంతల్లో వర్షం నీరు నిలిచిపోయి వాహనాలు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కనీసం గుంతలు కూడా పూడ్చని పరిస్థితి ఏర్పడింది.

–కె.నాగరాజు, ఆటో డ్రైవర్

బాలికల హైస్కూల్‌కు పురస్కారం



విజయవాడలో పురస్కారం అందుకుంటున్న హెచ్ఎం

కొయ్యలగూడెం: పరింపూడి జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు అంతర్జాతీయ ప్రమాణాల నిర్వహణ అవార్డు లభించినట్లు హెచ్‌ఎం నిమ్మలూరి ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా విజయవాడలో మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారన్నారు. హైస్కూల్‌లో విద్యార్థులకు భారత దేశం ప్రమాణాల విధానాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించామన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయురాలి హోదాలో కేఎల్ యూనివర్సిటీలో సర్టిఫికెట్, మెమెంటో అందుకున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలో కేవలం తమ పాఠశాలకు మాత్రమే ఈ పురస్కారం లభించడం గర్వకారణంగా ఉందన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

జంగారెడ్డిగూడెం: తిరుమలాపురం జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ సమకూరింది. పాఠశాల ఆన్‌లైన్ పనులకు కంప్యూటర్ అవసరాన్ని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సంయుక్తంగా జంగారెడ్డిగూడెం ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్‌కు తెలియజేయడంతో ఆయన స్పందించారు. మంగళవారం ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్ పి.రమా సతీష్ కుమార్ రూ.30 వేల విలువైన కంప్యూటర్‌ను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా మేనేజర్‌ను ఏఎంసీ చైర్మన్ వెలగల సత్యనారాయణ, హెచ్‌ఎం కె.భీమరాజు, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ ఫీల్డ్ అధికారి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోగి రమేష్ సవాల్ స్వీకరించాలి



మాట్లాడుతున్న గౌడ సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు

కొయ్యలగూడెం: నకిలీ మద్యం కేసు వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేష్ సవాల్‌ని కూటమి ప్రభుత్వం స్వీకరించాలని గౌడ సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చిటికెన శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గౌడ్ సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నకిలీ మద్యం కేసు వ్యవహారాన్ని జోగి రమేష్‌కు అంటగట్టేలా కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తుందన్నారు. దీనికి రమేష్ తిరుమల సన్నిధిలో ప్రమాణం చేయడం, లై డిటెక్టర్‌కు సిద్ధపడడం, అదే విధంగా సీబీఐ చేత దర్యాప్తు చెల్లించాలని డిమాండ్ చేశారన్నారు. వీటిని స్వీకరించే దమ్ము ధైర్యం సీఎం లేదా డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్‌లకు ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో నకిలీ మద్యం వ్యవహారం నడిచిందనేది వాస్తవమని, దీనిని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాజీ ఎంపీటీసీ మట్టా సత్యనారాయణ, మన్యం నాగేశ్వరరావు, మన్యం రమేష్, మన్యం శ్రీను, మార్గాన్ని పోసియ్య, రమణి మంగు, ఎలగాని ఫణీంద్ర, మన్యం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



గిరిజన బాలుర వసతి గృమంలో సరుకులను పరిశీలిస్తున్న డీడీ

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేఆర్ పురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పి.జనార్ధన్‌రావు వార్డెన్లను ఆదేశించారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ కళాశాల బాలికల వసతి గృహాన్ని, గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రికార్డులను పరిశీలించారు. అలాగే నిత్యవసర వస్తువులు, కూరగాయల స్టోర్‌ను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లోని మరుగుదొడ్లను పరిశీలించారు. బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని కోసం మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఐటీఐ కళాశాలలోని బిల్డింగ్‌కు మార్చే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి ఐటీడీఏ పీఓ రాములు నాయక్ కూడా రెండు రోజుల్లో పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ జనార్ధన్, వార్డెన్లు తామా వెంకటేశ్వరరావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బాలరాజుకు అభినందనలు



మాజీ ఎమ్మెల్యే బాలరాజు దంపతులను అభినందిస్తున్న సొసైటీ మాజీ అధ్యక్షురాలు

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా తెల్లం బాలరాజు నియామకం పార్టీ శ్రేణుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపిందని గవరవరం ఎల్‌ఏసీఎస్ మాజీ అధ్యక్షురాలు ఎగ్గిన వెంకటలక్ష్మి, రామకృష్ణ దంపతులు పేర్కొన్నారు. బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను మంగళవారం వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మెడికల్ కళాశాలల పీపీపీ విధానానికి నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చురుగ్గా సాగుతోందని పార్టీ శ్రేణులు ప్రజల్లో మమేకమవుతూ వైద్య విద్యకు కలిగిన నష్టాన్ని వివరిస్తున్నారని బాలరాజు పేర్కొన్నారు. వారం రోజుల్లో గ్రామ కమిటీల నియామకం పూర్తి చేసి వారికి పార్టీ పటిష్టతకు సంబంధించిన మరిన్ని బాధ్యతలను అప్పగిస్తామన్నారు. ఇకపై కార్యకర్తల అభిప్రాయమే తనకు ముఖ్యమని ఆయన తెలిపారు.

మద్ది కార్తీక మాసోత్సవాలు విజయవంతం చేయాలి



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవాలయంలో నెల రోజుల పాటు నిర్వహించే కార్తీకమాస మహోత్సవాలు, 32వ వార్షిక సప్తాహ మహోత్సవాలు విజయవంతం చేయాలని ఆర్డీవో ఎంవీ రమణ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మద్దిలో నిర్వహించిన ఉత్సవాలపై పలు శాఖల అధికారులతో ఉత్సవ ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 20 వరకు నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, నెల రోజులు జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని, అందుకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, నిత్యాన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను కార్య నిర్వహణాధికారి ఆర్‌వీ చందన వివరించారు. సమావేశంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎంపీడీవో కేఆర్‌ఎస్‌కే ప్రసాద్, లక్కవరం ఎస్సై ఎం.కుటుంబరావు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సోమేశ్వరరావు, దేవదాయ శాఖ సూపరింటెండెంట్ రంగారావు, అగ్నిమాపక అధికారి జి.అబ్రహం, ఆర్టీసీ సూపరింటెండెంట్ ఎంవీ లక్ష్మి, ఏవో శేఖర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని బాణసంచా విక్రయాలపై చర్యలు



బాణసంచా దుకాణాల స్థలాలను పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్

టి.నరసాపురం: అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న దీపావళి బాణసంచా దుకాణాల స్థలాలను మంగళవారం ఎస్సై ఎం.జయబాబు, తహసీల్దార్ టి.సాయిబాబా సిబ్బందితో పరిశీలించారు. దుకాణాల ఏర్పాటుదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా సామగ్రి దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ప్రతి షాపులో అగ్ని నిరోధక సామగ్రి ఉంచాలని తెలిపారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ట్యాంకర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఫణికుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి పూత దశలో జాగ్రత్తలు



మెట్ట ప్రాంతంలో పూత దశలో ఉన్న జీడి మామిడి తోట



జీడి తోటలో చెట్లకు దోమ సోకిన దృశ్యం

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో జీడి తోటలు ఎక్కువగా విస్తరించాయి. ప్రస్తుతం జీడి పూత ప్రారంభ దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జీడి మామిడి రైతులు పూత దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన శాఖ అధికారిణి ఎండి షాఫియా ఫర్హీన్ రైతులకు సూచిస్తున్నారు. సాధారణంగా జీడిమామిడిలో పూత అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రారంభమై జనవరి, ఫిబ్రవరి వరకు వస్తుంది. జీడిచెట్టుకు వచ్చిన పూతలో సుమారు 200 నుండి 800 వరకు పూలు పూస్తాయి. జీడిమామిడి చెట్లు పరాగ సంపర్కం వల్ల ఫలదీకరణ చెందుతాయి. జీడి మామిడి చెట్లు పూతకు రావాలంటే సుమారు 25 రోజుల నుంచి 30 రోజులు పొడి వాతావరణం ఉండాలి. ఒకవేళ అక్టోబర్ నుంచి నవంబర్ నెల వరకు వర్షాలు పడితే పూత ఆలస్యమై రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తెగుళ్ల తీవ్రత కూడా ఎక్కువయ్యే అవకాశాలు ఎక్కువ. జీడిమామిడి అంట్లు నాటిన రెండో సంవత్సరం నుంచే పూత వస్తుంది. ఆ పూతను రైతులు తుంచేసి చెట్ల శాఖలు పెరగడానికి ప్రోత్సహించాలి. దీనివల్ల చెట్లు బలంగా పెరిగి ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. వర్షాకాలంలో సిఫార్సు చేసిన ఎరువులు రెండు నుంచి మూడు సమ భాగాలుగా వేసుకోవాలి. ఐదు సంవత్సరాలు పైబడిన చెట్టుకు యూరియ 1.5 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 650 గ్రాములు, పొటాష్ కేజీ వేసుకోవాలి. పూత దశలో మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు పూత లోపల తేమ చేరి ఎండిన మగపూల వల్ల తామర పురుగులు లేదా తేయాకు దోమ ఉధృతి ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.

టి.దోమ సోకితే..

జీడిమామిడిలో టి దోమ పూత దశ అంటే అక్టోబర్, నవంబర్ నెలలో మొదలవుతుంది. జనవరిలో ఎక్కువై లేత చిగుళ్ళు, పూత, పూత కాడలను, చిన్న కాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చినప్పుడు ఒక రకమైన పదార్థం వదలడం వల్ల కాయలపై, చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతే కాకుండా పూత, చిగుర్లపై రంధ్రాల వల్ల ఫ్లవర్ బ్లైట్ అనే తెగులు వ్యాప్తి చెందుతుంది. దోమ నివారణకు పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒకసారి, పూలు ఫలదీకరణ చెందిన తరువాత రెండోసారి, కాయ గోలీ సైజులో ఉన్నప్పుడు మూడో సారి పిచికారీ చెయ్యాలి. చెట్లు చిగురించినప్పుడు మొదటి పిచికారీకి రైతులు ల్యాండా సైహాలోత్రిన్ 0.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి, లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత కొమ్మలు కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి రెండోసారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ల్యాండా సైహాలోత్రిన్ 0.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి మూడోసారి పిచికారీ చేయాలి. వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. పొడి వాతావరణం ఉన్నప్పుడు బూడిద తెగులు ఎక్కువగా పూతను నష్టపరిచి పూత రాలిపోయేలా చేస్తుంది.

ఆకు పూత, కాయ మచ్చ తెగులు నివారణకు

ఆకులపై చిన్న, చిన్న లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపీ మచ్చలు పెరుగుతూ మచ్చ మధ్య ఎండిపోయి చివరికి మొత్తం ఆకు ఎండి రాలిపోతుంది. పూత, పూత కాడలపై మచ్చలు వచ్చి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు ఆశించిన కొమ్మలు తొలగించుకోవాలి. మాంకోజెబ్ గ్రాము లీటరు నీటికి, లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా క్లోరో తాలోనిల్ పిచికారీ చేసుకోవాలి.



ఎండీ షాఫియ ఫర్హీన్
ఉద్యానశాఖ అధికారిణి - చింతలపూడి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

చింతలపూడి: రాష్ట్రంలో పలు మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ నవంబర్ 3 నుంచి సమ్మె చేస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం చింతలపూడి శాఖ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమస్యలపై కమిషనర్ ఎ.రాంబాబుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరణించిన మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి అవుట్‌సోర్సింగ్ విధానంలో పనుల కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలన్నారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు, కార్మిక సంఘం నాయకులు కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

వినూత్న హెచ్చరిక



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత వద్ద కుర్చీతో ఏర్పాటు చేసిన హెచ్చరిక

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం–ఏలూరు రోడ్డులో గుంత ఉంది జాగ్రత్త అంటూ వినూత్న హెచ్చరికను ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో నీరు నిల్వ ఉంది. ఈ రోడ్డులో వెళ్లే వాహనదారులకు గుంత వలన ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా గొయ్యి ముందు ఒక కుర్చీని ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం–ఏలూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉన్నాయి. వర్షపు నీరు ఆ గుంతల్లో చేరడంతో వాటిని అంచనా వేయలేక పలువురు గాయాలపాలవుతున్నారు. దీంతో ముందు పెద్ద గుంత ఉందని, ఆగి వెళ్లకపోతే పడిపోతావని హెచ్చరిస్తున్నట్లు స్థానికులు కుర్చీని గుంత ముందు ఏర్పాటు చేశారు.

చలో ఐటీడీఏను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణచైతన్య

కుక్కునూరు: ఏజెన్సీలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఈ నెల 22వ తేదిన నిర్వహించే కేఆర్ పురం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య కోరారు. మంగళవారం కుక్కునూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే చందంగా ఉందని విమర్శించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిస్తామన్న ప్రభుత్వాల మాటలు నీటి మూటలుగానే తయారైయ్యాయని దుయ్యబట్టారు. కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లో గత ముప్పై ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు, వలస గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, ఐతా సురేష్, కురాకుల బాబురావు, వెంకటాచారి, పాపారావు, రమణయ్య, నగేష్, సోమరాజు,రమేష్, నవీన్,వెంకట్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.